# సాక్షి జగిత్యాల

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023






## ఘనంగా పోచమ్మ బోనాలు

కోరుట్ల: సంగెం గ్రామంలోని గౌడ సంఘం మహిళలు గురువారం పోచమ్మ తల్లికి బోనాలతో నైవేద్యం సమర్పించారు.



## ఈజీఎస్ దినోత్సవం

మల్యాల : ఈజీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సంబురాలు జరుపుకున్నారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/13.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదై, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### మన ఊరు.. మన బడి పనులు వేగవంతం చేయండి



సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలో చేపట్టిన మన ఊరు–మన బడి పనులను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ మకరంద్ సూచించారు. పట్టణంలోని శివాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను ఆయన గురువారం పరిశీలించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. అనంతరం ఆరోవార్డులో చేపట్టిన కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు. మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం గురించి వివరించాలన్నారు. ఆ తర్వాత ఖాదీ స్థలంలో చేపట్టిన సమీకృత మార్కెట్ పనులను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రాజీకుమార్, ఏఈ అరుణ్ తదితరులు ఉన్నారు.

### ఆయకట్టుకు సాగునీరు అందించాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): రోళ్లవాగు బుగ్గచెరువు పరిధిలోని చెర్లపల్లి, కండ్లపల్లి, రంగసాగర్, మంగేళ ఆయకట్టుకు సాగునీరు అందించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీర్పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహోత్సవాలకు ఆయన గురువారం హాజరై పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు కట్ట తెగిన సమయంలో ఆ గ్రామాలకు తాత్కాలికంగా సాగు నీరందించడానికి రింగ్‌బండ్ నిర్మించారని, ఇటీవల అది తెగిపోయిందని పేర్కొన్నారు. దీంతో సుమారు రెండువేల ఎకరాలకు సాగు నీరందడం లేదన్నారు. పంటలు ఎండిపోకుండా రెండు రోజుల్లో నీరు అందించాలని ఈఈ నారాయణరెడ్డిని ఫోన్‌లో కోరారు. ఈఈ.. సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీ వివరించారు. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ ఆకుల జమున, నాయకులు గుడిసె జితేందర్, చెర్ప్యారి సుభాష్, కోంద్ర రాంచంద్రారెడ్డి, భైరవేని సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

### 'విద్యారంగాన్ని విస్మరించిన కేంద్రప్రభుత్వం'



నిరసన తెలుపుతున్న నాయకులు

జగిత్యాల: కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించలేదని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమ్ విమర్శించారు. ప్రభుత్వ విద్యను నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని ధ్వజమెత్తింది. జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. విద్యను కాషాయీకరణ చేసేలా కేంద్రప్రభుత్వం కుట్ర చేస్తోందని అన్నారు. విభజన హామీలో ఉన్న విద్యా సంస్థలను తెలంగాణకు కేటాయించకుండా వివక్ష చూపుతోందని ధ్వజమెత్తారు. విద్యా రంగాన్ని అభివృద్ధి చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంశీ, సంజయ్ పాల్గొన్నారు.

### ధర్మపురివాసికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న జగదీశ్వర్‌శర్మ

జగిత్యాలరూరల్: ధర్మపురి పట్టణానికి చెందిన టీవీ గాయకుడు గుండి జగదీశ్వర్‌శర్మకు ఎన్టీఆర్ ఎక్స్‌లెన్స్ ఉత్తమ గాయకుడి అవార్డు అందుకున్నారు. ఇప్పటికే ఆయన నేషనల్ అవార్డు, తెలంగాణరత్న, ఎస్పీ బాలు అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం ప్రముఖ సినీనటుడు నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఎన్టీఆర్ ఎక్స్‌లెన్స్ అవార్డు సొంతం చేసుకున్నారు. కళానిలయం, సాంస్కృతిక శాఖ, చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభవేదిక ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేశారు.

# నత్తనడకన 'మన బడి'

- తొలివిడతలో 274 ప్రభుత్వ పాఠశాలల ఎంపిక
- 19 స్కూళ్లలోనే అభివృద్ధి పనులు పూర్తి
- మన ఊరు.. మన బడి పథకం ప్రారంభించి ఏడాది పూర్తి
- అయినా చేరుకోని నిర్దేశిత లక్ష్యం



సిరికొండ ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లో ఫ్లోరింగ్ కోసం చేపట్టిన తవ్వకం పనులు



హ్యాండ్ వాషింగ్ పనులు చేస్తున్న కూలీలు

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు– మన బడి'కి సుమారు ఏడాది క్రితం శ్రీకారం చుట్టింది. జిల్లాలోని మూడోవంతు స్కూళ్లను తొలివిడతలో ఎంపిక చేసింది. బడులను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. గతేడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించింది. పాఠశాలల పునః ప్రారంభం నాటికి ప్రగతి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఆశించిన పురోగతి లేకపోవడంతో ఈనెల ఒకటో తేదీనాటికైనా పూర్తిచేయాలని మరోసారి గడువు విధించింది. ఈ గడువు కూడా పూర్తయినా అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**274 పాఠశాలలు.. రూ.65 కోట్లు..**

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాల పరిధిలో 380 గ్రామాలు ఉండగా.. ఇందులో 783 ప్రభుత్వ పాఠశాలలున్నాయి.
- 'మన ఊరు– మన బడి' కింద గతేడాది ఫిబ్రవరిలో తొలివిడతలో ఎంపికైన 274 పాఠశాలల్లో అభివృద్ధి పనులకు రూ.65 కోట్లు కేటాయించారు.
- ఎంపికైన వాటిలో మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పన, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు సరిపడేలా ఫర్నీచర్, గదులకు రంగులు వేయించడం, ప్రహరీలు, వంటగదులు, గ్రీన్‌బోర్డులు, డిజిటల్ క్లాసురూంలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- కానీ, నెలలు గడిచినా పనులు మందకొడిగా సాగడంపై ఉన్నతాధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**మండలానికి రెండు మోడల్ స్కూళ్ల ఎంపిక**

తొలివిడతలో ఎంపికైన బడుల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నెలల తరబడి జాప్యం జరుగుతోందని ఉన్నతాధికారులు గుర్తించారు. ఇలా అయితే గడువులోగా పనులు పూర్తిచేయడం కష్టమని భావించారు. నిర్దేశిత లక్ష్య సాధనకోసం మండలానికి రెండింటిని మోడల్ స్కూళ్లుగా గుర్తించి మొత్తం 36 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో పనులు వేగవంతంగా పూర్తిచేయాలని నెలరోజుల క్రితం ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈనెల ఒకటో తేదీ వరకు నిర్మాణాలు పూర్తిచేయించాలని మండలాధికారులను ఆదేశించారు. కానీ, ఇందులోనూ 19 స్కూళ్లలోనే పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు అంటున్నారు. మిగతా 17 పాఠశాలల్లో మరో వారం రోజుల్లో పూర్తి చేయించాలనే లక్ష్యంతో ఉన్నట్లు పేర్కొంటున్నారు. మరోవైపు.. పనులు పూర్తిచేశాక డబ్బులు వస్తాయో లేదోనని ఎస్‌ఎంసీ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పనులు చేసేందుకు ఆసక్తి చూపకపోవడమే జాప్యానికి కారణమని తెలిసింది.

### బిల్లులు త్వరగా చెల్లించాలి



'మన ఊరు– మన బడి' కింద సిరికొండ ప్రాథమిక పాఠశాలకు రూ.11.62 లక్షలు మంజూరయ్యాయి. మోడల్ స్కూల్‌గా గుర్తించి పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులు చెప్పారు. పనులు చేయిస్తున్నా ఇప్పటివరకు రూ.37 వేల బిల్లు మాత్రమే వచ్చింది. చేసిన పనులకు త్వరగా పూర్తి బిల్లులు చెల్లిస్తే మిగతా పనులు త్వరగా చేయించాలని ఉంటుంది. – మారిశెట్టి బాలయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సిరికొండ, కథలాపూర్

### పనులు పురోగతిలో ఉన్నాయి



జిల్లాలో 'మన ఊరు– మన బడి తొలివిడత ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. మోడల్ పాఠశాలలుగా ఎంపికైన వాటిలోనూ వారంరోజుల్లో పూర్తిచేయించి ప్రారంభిస్తాం. మిగతా బడుల్లో వీలైనంతా త్వరగా పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించాం. – జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

# మార్చిలోగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తదితరులు

జగిత్యాలఅగ్రికల్చర్: వచ్చే మార్చిలోగా జిల్లాలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటిస్తామని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలోని నక్కల రవీందర్‌రెడ్డి తోటలో గురువారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో 4,300 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతామన్నారు. ఫిబ్రవరిలో 800 ఎకరాలు, మార్చిలో 3,500 ఎకరాల్లో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. ఇప్పటికే డ్రిప్ పరికరాలను రాయితీపై రైతులకు అందించామని తెలిపారు. రైతుల స్పందన ఎక్కువగా ఉందని, నర్సరీల్లో ఎదుగుదలను బట్టి డీడీలు చెల్లించిన వారికి మొక్కలు అందజేస్తామని చెప్పారు. జిల్లాలో లక్ష్యాన్ని మించి ఆయిల్‌పామ్ సాగు అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, దేశంలో వంటనూనెల కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రజావసరాల కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, డిమాండ్ ఉన్న పంటలను పండించాలని రైతులకు సూచించారు. ప్రతీ రైతు వ్యాపారిగా మారి ఆదాయం పెంచుకునే మార్గాలపై అన్వేషణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్, ఉద్యానశాఖ అధికారులు శ్యాంప్రసాద్, స్పందన, అన్వేష్, ఎంపీపీ రాజు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కల రాధ, రైతుబంధు సమితి కన్వీనర్ నక్కల రవీందర్ రెడ్డి, సర్పంచ్ నారాయణ పాల్గొన్నారు.

**పనులు వేగవంతం చేయాలి**

జగిత్యాల: జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ముఖ్యంగా ధరణి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మకరంద్, లత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ స్మైల్–9 విజయవంతం

- 18 మంది బాలకార్మికులకు విముక్తి
- ఎస్పీ భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రభుత్వం ఏడాదిలో రెండుసార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎస్పీ భాస్కర్ తెలిపారు. ఈసందర్భంగా తప్పిపోయిన బాలలను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి అన్నిప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతం చేస్తున్నామన్నారు. తన కార్యాలయంలో ఎస్పీ గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆపరేషన్ స్మైల్ విజయవంతం కోసం ఒక్కో సబ్ డివిజన్‌లో ఒక ఎస్సై, ముగ్గురు కానిస్టేబుల్స్, ఒక మహిళా కానిస్టేబుల్‌ను నియమించి చైల్డ్‌లైన్‌తో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థల సాయంతో జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 1 – 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్–9లో భాగంగా 18 మంది బాలకార్మికులను గుర్తించి తల్లిదండ్రులకు చేర్చామని తెలిపారు. సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేశామని చెప్పారు. బాలలను పనిలో పెట్టుకున్నా.. పనుల్లో నిమగ్నమైనా, తప్పిపోయినా, తల్లిదండ్రులు వదిలేసిన బాలల గురించిన సమాచారాన్ని డయల్ 100కు చేరవేయాలని ఎస్పీ కోరారు.

# విద్యార్థుల జీవితాలతో సీఎం చెలగాటం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

- ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన రాష్ట్ర ప్రభుత్వం
- ఉపాధ్యాయ భర్తీ ప్రక్రియ ఎక్కడ?
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థుల జీవితాలతో సీఎం కేసీఆర్ చెలగాటం ఆడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని, టెట్ ఫలితాలు వెలువడి నెలలు గడిచినా ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియ జాడలేన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలల్లో స్వీపర్లు, స్కావెంజర్లు లేక నిర్వహణ ఎలా సాధ్యమవుతుందో విద్యాశాఖ మంత్రి చెప్పాలన్నారు. ఒకే ఒక కేజీ టు పీజీ పాఠశాల ప్రారంభించి రాష్ట్రమంతా ప్రారంభించినట్లు ప్రచారం చేసుకోవడం ఏమిటని నిలదీశారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ఆర్థిక భారమైనా సామాన్యులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించినా బోధనా సిబ్బంది లేక అవి వృథాగా మారాయని తెలిపారు. 2022–23 విద్యా సవత్సరంలో 20వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామన్న సీఎం కేసీఆర్.. నేటికీ భర్తీ చేయడం లేదన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధులు రద్దు చేసి సుమారు రూ.600 కోట్లు మన ఊరు.. మన బడి పథకానికి మళ్లించారని ఆరోపించారు. అయినా, 10శాతం పనులు కూడా పూర్తికాలేదని ఆరోపించారు. కాగా, ఈనెల 6నుంచి చేపట్టే హాథ్ సే హాథ్ జోడో యాత్రను వియవంతం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితోపాటు డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. యాత్ర ప్రచార పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, నాయకులు కొత్త మోహన్, కండ్లపల్లి దుర్గయ్య, మన్సూర్, రాజేందర్, అశోక్, గంగారెడ్డి, మహిపాల్, రాధకిషన్, విజయ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకే ఆత్మహత్యాయత్నం

- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల స్పష్టత
- సిరికొండ జెడ్పీ హైస్కూల్‌లో అధికారుల విచారణ



ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు

కథలాపూర్(వేములవాడ): 'వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి.. చదువుపై దృష్టి పెట్టాలి.. సెల్‌ఫోన్ ఎక్కువసేపు వినియోగిస్తూ సమయాన్ని వృథా చేసుకోవద్దు' అని వారించినందుకే సిరికొండ జెడ్పీ హైస్కూల్‌లోని ఇద్దరు విద్యార్థినులు ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించినట్లు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో ఆనందరావు వేర్వేరుగా సిరికొండ జెడ్పీ హైస్కూల్‌ను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత ఇద్దరు విద్యార్థినులు మరుగుదొడ్ల వైపు వెళ్లి ఎలుకల నివారణ మందు తిన్నట్లు తోటి విద్యార్థులు చెప్పడంతో అప్రమత్తమయ్యామని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థినులు తిన్న తర్వాత అక్కడే పడేసిన ఎలుకల నివారణ మందు ప్యాకెట్‌ను తహసీల్దార్ శ్రీనివాస్‌కు చూపించారు. బాలికలు ఆరోగ్యంగా ఉన్నారని, శుక్రవారం వారిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేస్తారని పేర్కొన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ నాగేశ్ ఉన్నారు.

## విపత్తులపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

మల్లాపూర్(కోరుట్ల): విపత్తులను అప్రమత్తంగా ఉండి ఎదుర్కొవాలని జాతీయ విపత్తు నిర్వహణ దళం కమాండర్ మన్మోహన్ యాదవ్ సూచించారు. వాల్గొండ శ్రీరామలింగేశ్వర ఆలయం సమీపంలో గురువారం విపత్తుల నివారణపై అవగాహన కల్పించారు. మానవ తప్పిదాలు, ప్రకృతిలో జరిగే మార్పులతోనే విపత్తులు సంభవిస్తాయన్నారు. అనంతరం 15మంది ఎన్డీఆర్‌ఎఫ్ బృందంతో పాటు అగ్నిమాపకశాఖ అధికారులు భూకంపం, వరదలు, అగ్నిప్రమాదాలు, పాముకాటు, అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం వంటి విపత్తులను ఎదుర్కొనే వ్యూహాలను ప్రదర్శనల ద్వారా వివరించారు. ఎంపీపీ కాటిపెల్లి సరోజన తదితరులు పాల్గొన్నారు.

# పురపాలికల్లో ఇంటలిజెన్స్ ఆరా

- బల్దియాల్లో అవిశ్వాసాలపై ఆరా
- రంగంలోకి దిగిన అధికార పార్టీ
- మున్సిపాలిటీల్లో విస్తృతంగా సర్వే



కోరుట్ల: సంచలనం రేపిన జగిత్యాల మున్సిపల్ అవిశ్వాస ముసలం తర్వాత జిల్లాలోని మిగతా మున్సిపాల్టీల్లో పరిస్థితిని అంచనా వేసేందుకు ఇంటలిజెన్స్ రంగంలోకి దిగింది. జగిత్యాల బల్దియాలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు, మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణికి మధ్య అభిప్రాయ భేదాలపై ఆదినుంచీ సర్దుబాటు చేసేవారు లేక పరిస్థితి విషమించిందని, చివరకు భోగ శ్రావణి రాజీనామా చేసే వరకూ పరిస్థితి వెళ్లిందని విశ్లేషకులు అంటున్నారు. జిల్లాలో బలంగా ఉన్న ఓ సామాజిక వర్గంలో ఇదే అసంతృప్తికి కారణమయిందన్న ప్రచారం సాగుతోంది. ఇదేరీతిలో జిల్లాలో ఇతర పురపాలికల్లో అవిశ్వాసం జాడలు ఏమైనా కనిపిస్తున్నాయా? అనేక అంశంపై స్పష్టత కోసం ఇంటలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగి ఆరా తీయడం గమనార్హం.

**గుట్టుగా సర్వే..**

- జిల్లాలో జగిత్యాల సహా కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాల్టీలు ఉన్నాయి.
- వీటిలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాల్టీలు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పరిధిలోని కోరుట్ల నియోజకవర్గంలో ఉన్నాయి.
- కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాల్టీల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్లకు మధ్య సయోధ్య బాగానే ఉండటంతో అవిశ్వాసం జాడలు కనిపించడం లేదు.
- కిందిస్థాయిలో కౌన్సిలర్ల మధ్య కొంత భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఎమ్మెల్యే పరిధిని దాటిపోయే పరిస్థితులు లేవని అంటున్నారు.
- జగిత్యాల సెగ్మెంట్‌లోని మరో మున్సిపాల్టీ రాయికల్ కౌన్సిల్‌లో పరిస్థితి హద్దుల్లోనే ఉన్నట్లు సమాచారం.
- ఇక మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రాతినిధ్యం వహించే ధర్మపురి మున్సిపాల్టీలోనూ పరిస్థితి సజావుగానే ఉన్నట్లు ఇంటిలిజెన్స్ సర్వేలో తేలినట్లు సమాచారం.

**స్వపక్షం.. ప్రతిపక్షం తీరుపై ఆరా**

జిల్లాలోని అన్నిమున్సిపాల్టీల్లో అధికార పార్టీ పక్షాన ఉన్న కౌన్సిలర్లు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లు ఎంతమంది ఉన్నారు? ఎవరి బలం ఎంత? అనే అంశాలపై లోతుగా ఇంటలిజెన్స్ ఆరా తీసినట్లు సమాచారం. ఎక్కడైనా అధికార పక్షంలో ఉన్న అసంతృప్తి వర్గం.. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాం వైపు ముందుకు కదిలి సమీకరణాలు మార్చే అవకాశాలు ఉన్నాయా? అనే విషయంలో ఇంటలిజెన్స్ అధికారులు పూర్తిస్థాయి వివరాలు సేకరించినట్లు సమాచారం. మున్సిపల్ పాలకవర్గాల్లోని స్వపక్షంలో అసంతృప్తి వర్గాలు, ప్రతిపక్ష పార్టీలకు చెందినవారు జతకలిసే అవకాశాలు ఎలా ఉన్నాయన్న అంశంపైనా ఇంటలిజెన్స్ సమగ్ర వివరాలు సేకరించినట్లు సమాచారం.

## క్లుప్తంగా

### మండలాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి


మంత్రి దయాకర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొడిమ్యాల(ధర్మపురి): కొడిమ్యాల మండలాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సింగిల్‌విండో చైర్మన్ మేనేని రాజా నర్సింగరావు గురువారం హైదరాబాద్‌లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. మండలంలోని దమ్మయపేట, కోనాపూర్, బొల్లెని చెరువుతో పాటు పలు గ్రామాలకు బీటీ రోడ్లు వేయాలని, దీనికి రూ.5కోట్లు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

### గల్ఫ్ కార్మికుల సమస్యలను లేవనెత్తాలి


వినతిపత్రం అందజేస్తున్న మండల అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి

మేడిపెల్లి: గల్ఫ్ కార్మికుల సమస్యలపై శాసనసభలో లేవనేత్తాలని కాంగ్రెస్ శాసనసభ పక్షనేత మల్లు భట్టి విక్రమార్కను టీపీసీసీ ఎన్నారై సెల్ గల్ఫ్ కన్వీనర్, కాంగ్రెస్ పార్టీ మేడిపెల్లి మండల అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి కోరారు. గురువారం రోజు హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. టీఆర్‌ఎస్ పార్టీ 2014 మ్యానిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామని హమీ ఇచ్చిందని, ఆ హమీని నెరవేర్చేలా శాసనసభలో చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

### దుబాయిలో గంభీర్‌పూర్ వాసి మృతి


వెంకటేశ్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన లంకదాసరి వెంకటేశ్(34) దుబాయి దేశంలో అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్ ఉపాధి నిమిత్తం నాలుగేళ్ల క్రితం దుబాయి దేశం వెళ్లి అక్కడ కార్మికుడిగా పనిచేశారు. కంపెనీలో సరైన ఉపాధి, జీతం లేకపోవడంతో కల్లిబిల్లి అయ్యారు. ఇటీవల అనారోగ్యానికి గురి కాగా.. ఈనెల 1న వెంకటేశ్ మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు అక్కడి వారు ఫోన్‌లో సమాచారమందించారు. మృతుడికి భార్య పద్మ, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మృతదేహం స్వగ్రామానికి పంపించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# యువ జోరు.. పరుగుల హోరు..





సీనియర్స్ విభాగంలో ఫైనల్‌కు చేరిన వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు, హోరాహోరీగా తలపడుతున్న జట్లు, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

- ఎస్‌పీఎల్ సీజన్–4లో తొలి అర్ధసెంచరీ నమోదు
- రెండో రోజు పోటీలను ప్రారంభించిన డీటీసీ చంద్రశేఖర్ గౌడ్
- సీనియర్స్ ఫైనల్‌లో వాగ్దేవి కళాశాల, మంచిర్యాల

కరీంనగర్‌స్పోర్ట్స్: అసలు క్రికెట్ పోరు అంటే ఇదేనేమో.. ఓ వైపు సిక్సర్ల మోత.. మరోవైపు బౌండరీల బాదుడు.. ఇలా మైదానం మొత్తం పరుగుల వరదను పారిస్తుంటే ప్రేక్షకులు, తోటి క్రీడాకారుల కేకలు, ఈలల మధ్య 'సాక్షి' ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా, హోరాహోరీగా సాగాయి. ఈ సీజన్‌లో తొలి అర్ధ సెంచరీని వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి నమోదు చేశాడు. నేడు సీనియర్స్ సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

**క్రీడలతో ఉజ్వల భవిష్యత్..**

క్రీడలతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, క్రీడల్లో రాణించినట్లే విద్యలోనూ రాణించాలని ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారి మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. ఎస్‌పీఎల్ రెండో రోజు పోటీలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, కరీంనగర్ బ్యూరో చీఫ్ బాషబోయిన అనిల్ కుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాసరావు, సాక్షి సిబ్బంది సిలివేరి మహేందర్, రాకేష్, పరుషరాం, జ్యోతిష్మతి కళాశాల పీడీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ విశ్వప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


అర్ధసెంచరీ చేసిన నిఖిల్ సాయి

**తొలి అర్ధసెంచరీ నమోదు**

వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి ట్రినిటీ కళాశాలతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కేవలం 24 బంతుల్లో 4 సిక్స్‌లు, 6 ఫోర్లతో 51 పరుగులు చేసి అర్ధసెంచరీని నమోదు చేశాడు. అదే కళాశాలకు చెందిన సాయి కృష్ణారెడ్డి 21 బంతుల్లో 3 సిక్స్‌లు, 6 ఫోర్లతో 46 పరుగులు చేయగా.. సెమీస్‌లో 18 బంతుల్లో ఒక సిక్స్, 4 ఫోర్లతో 34 పరుగులు చేశారు. అశ్వక్ 3 వికెట్లు, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నౌమాన్ 10 బంతుల్లో 3 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 25 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీశాడు.

**రెండో రోజు ఫలితాలు**

- జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్, ఎస్సారార్ కళాశాల కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎస్సారార్ కళాశాల 51 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌లో ప్రవేశించింది. జట్టులో అల్సీ, నవీన్ రాణించారు
- జేఎన్‌టీయూ మంథని, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీ చైతన్య జట్టు 32 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. జట్టులో నౌమాన్, అరవింద్ రాణించారు.
- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల పెద్దపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వాగ్దేవి జట్టు 70 పరుగులు భారీ విజయాన్ని నమోదు చేసింది. జట్టులో నిఖిల్ సాయి, సాయికృష్ణారెడ్డి రాణించారు.
- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసి సీనియర్స్ విభాగంలో ఫైనల్‌లో ప్రవేశించింది.



### ఎస్పీని కలిసిన జిల్లా రవాణా శాఖ అధికారి

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎగ్గిడి భాస్కర్‌ను గురువారం జిల్లా రవాణా శాఖ అధికారి అజ్మీర శ్యామ్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వెంకటరమణ ఉన్నారు.

**అభినందించిన టీజీవో నాయకులు**

జగిత్యాల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్ ను జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) నా యకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు అశోక్, కందుకూరి రవిబాబు, గణేశ్, లావణ్య పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మెట్‌పల్లి: పట్టణంలోని సింగాపూర్ కాలనీ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

### లారీ ఢీకొని యువకుడికి గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం గుల్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన కందుగుల మహేశ్‌కు గురువారం గుల్రాజ్‌పల్లి గ్రామ శివారులో లారీ ఢీకొనడంతో గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు కందుగుల వెంకటేశ్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

## రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

మెట్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో అధిక స్థానాల్లో గెలుపుతో అధికారం సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వాసవీగార్డెన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాల కింద రాష్ట్రానికి పెద్దఎత్తున నిధులను మంజూరు చేస్తోందని, వీటిని ప్రజల్లోకి తీసుకపోవాలన్నారు. జిల్లాలో ప్రధానమైన కొండగట్టు, ధర్మపురి ఆలయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో విద్యుత్ సంస్థలు నష్టాల్లో కూరుకపోయాయని, వాటిని అధిగమించేందుకు ఏసీడీ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా, నాయకులు చెట్లపల్లి సుఖేందర్, ఇల్లెందుల శ్రీనివాస్, బొడ్ల రమేశ్, గుంటుక సదాశివ్, జెఎన్ సునీత, దొనికెల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియాతో రైతులకు లాభాలు


మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

జగిత్యాలజోన్: నానో యూరియాతో రైతులకు ఎన్నో లాభాలున్నాయని న్యూఢిల్లీకి చెందిన ఇఫ్కో జనరల్ మేనేజర్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగిత్యాలతో పాటు రాయికల్ మండలంలో గురువారం ఇఫ్కో నానో యూరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో రైతులకు సరిపడా నానో యూరియా ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒక ఎకర పంటలో 500 మి.లీ. బాటిల్‌తో పిచికారి చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. 500 మి.లీ. నానో యూరియా 45 కిలో యూరియా బస్తాకు సమానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్ మాట్లాడుతూ సాధారణంగా వాడే యూరియాకు బదులు నానో యూరియా వాడి లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో జగిత్యాల జిల్లా మేనేజర్ శ్రీధర్, రాయికల్ సింగిల్‌విండో చైర్మన్ మల్లారెడ్డి, మాజీ చైర్మన్ పడిగెల రవీందర్‌రెడ్డి, జిల్లాలోని సహకార సంఘాల సీఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


అనిల్ మృతదేహం

మల్లాపూర్(కోరుట్ల): మల్లాపూర్ మండలం గుండంపల్లి శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మీదిని అనిల్(35) మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మేడిపల్లి మండలం రంగాపూర్‌కు చెందిన మీదిని అనిల్ ద్విచక్రవాహనంపై గుండంపల్లిలోని అత్తవారి ఇంట్లో ఉన్న భార్య తిరుమలను తీసుకెళ్లేందుకు వెళ్లాడు. తిరిగి ఒక్కడే బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా గుండంపల్లి–సాతారం మార్గంలోని మూలమలుపు వద్ద అతివేగంతో అదుపుతప్పి బైక్‌తో సహా పక్కనే ఉన్న కందకంలో పడి మృతి చెందాడు. రాత్రి వరకు అనిల్ స్వగ్రామానికి రాకపోవడంతో గుండంపల్లిలోని బంధువులకు సమాచారం ఇచ్చారు. స్థానికులతో కలిసి బంధువులు వెతకగా గ్రామశివారులోని కందకంలో పడి చనిపోయిన అనిల్ కనిపించడంతో బోరున విలపించారు. మృతుడి తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

### హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలు

జగిత్యాలజోన్: భూ తగాదాల నేపథ్యంలో తమ్ముడిని చంపేందుకు ప్రయత్నించిన అన్నకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రసాద్ గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మల్యాల మండలం రాంపూర్‌కు చెందిన ఇట్టెట రాజిరెడ్డి, గంగారెడ్డిలు అన్నదమ్ముళ్లు. వీరిద్దరి మధ్య కొంతకాలంగా భూతగాదాలు న్నాయి. పలుమార్లు గొడవలు కూడా జరిగాయి. మార్చి 7, 2018న పని నిమిత్తం ఇట్టెడి గంగారెడ్డి గ్రామంలోని బస్టాండ్ వద్దకు వెళ్లగా ఇదే అదునుగా భావించి చంపాలనే ఉద్దేశ్యంతో అతడి అన్న రాజిరెడ్డి కత్తితో దాడి చేశారు. తీవ్రగాయాలతో గంగారెడ్డి అక్కడే పడిపోవడంతో బస్టాండ్‌లోని గ్రామస్తులు సంఘటన స్థానికి రావడంతో రాజిరెడ్డి పారిపోయాడు. విషయం తెలిసిన గంగారెడ్డి భార్య గంగవ్వ తీవ్రగాయాలతో ఉన్న భర్తను ఆస్పత్రికి తరలించి మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై ఎన్.రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడైన రాజిరెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి నిందితుడైన రాజిరెడ్డికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## ఏసీడీ చార్జీలను నిరసిస్తూ కాంగ్రెస్ ధర్నా


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి(ధర్మపురి): ప్రభుత్వం అదనంగా విధిస్తున్న విద్యుత్ ఏసీడీ చార్జీలను నిరసిస్తూ గురువారం పెగడపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట పెగడపల్లి–కరీంనగర్ రహదారిపై కాంగ్రెస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏసీడీ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలను దోచుకుంటోందని అన్నారు. విద్యుత్ కంపెనీలకు బకాయిలు చెల్లించనందుకే ఏసీడీ పేరిట డబ్బులు వసూలు చేసి ఆర్థిక భారం మోపుతోందని తెలిపారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతూ గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోత విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఏసీడీ చార్జీలను రద్దు చేసి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ ఏడీఈ వరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బతికపల్లి సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, కాంగ్రెస్ నాయకులు గజ్జల స్వామి, సింగసాని స్వామి, సత్యనారాయణరెడ్డి, గంద్ర వెంకట్‌రావు, ఉప్పు రవి, గోపు అశోక్‌రెడ్డి, శ్రీరామ్ అంజయ్య, సత్తయ్య, సందీప్, నందిరెడ్డి, తిరుపతినాయక్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి


నేరెళ్ల గంగమ్మ ఆలయ వార్షికోత్సవంలో అడ్లూరి

బుగ్గారం(ధర్మపురి): గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో జరుగుతున్న గంగమ్మ ఆలయ వార్షికోత్సవంలో గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కృషితో రూ.3.60వేల వ్యయంతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. నాయకులు సంగనభట్ల దినేష్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్, బాలాగౌడ్, జాజాల రమేశ్, రాందేని మొగిలి, పురంశెట్టి మల్లేశం, తొట్ల రాజన్న, గరిగె రమేశ్, బోరె మల్లేశం, తోకల లింగయ్య, చిట్యాల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అభివృద్ధి కోసం పాదయాత్ర


మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం ఈనెల 4న పాదయాత్ర చేపడ్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మల్యాల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంజనేయస్వామి ఆలయం బీఆర్‌ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైందని, భక్తులకు కనీస మౌలిక వసతులు కల్పించలేదని అన్నారు. మాస్టర్ ప్లాన్ అమలు చేసి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న కొండగట్టు నుంచి జగిత్యాల కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. కొండగట్టుకు వంద కోట్లు నిధులు విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా హామీ నిలబెట్టుకోలేదని ఎద్దేవ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, మాజీ సర్పంచ్ ఎడిపెల్లి రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంచర్ల లక్ష్మణాచారి, నాయకులు స్వామిరెడ్డి, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, రాజలింగం పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రాము

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం తప్పదని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రాము అన్నారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 41 మందిని కోర్టులో హాజరుపర్చగా గురువారం వారికి న్యాయమూర్తి రూ.44 వేల జరిమానా విధించారు. అనంతరం వీరికి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## వైభవోపేతం.. శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణం వీక్షిస్తున్న భక్తజనం

సారంగాపూర్: బీర్‌పూర్‌లోని కొండపై నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం రాత్రి స్వామి వార్లకు కల్యాణం నిర్వహించారు. కల్యాణంకు ముందు ఆలయంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభం వద్ద సంతానం లేని దంపతులకు గరుడ ముద్దలను అర్చకులు అందజేశారు. గరుడ ముద్దలను పొందేందుకు భక్తులు పోటీపడ్డారు. ఎంపీపీ మస్కరి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ రాంచందర్‌రావు, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**రూ.1,000 టికెట్‌పై భక్తుల అసంతృప్తి**

కల్యాణంలో కుర్చుండే భక్తులకు రూ.1,000 టికెట్ వసూలు చేయడంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. దీనిపై నాయకుడు భైరవేని సత్యనారాయణ సాధారణ భక్తులను కల్యాణంలో పాల్గొనకుండా రూ.1000 టికెట్ పెంచారని అన్నారు. కల్యాణం తిలకించేందుకు వచ్చిన సాధారణ భక్తులకు దూరంగా భారీకేడ్లు ఏర్పాటు చేయడంపై తప్పుపట్టారు.

# కలెక్టర్‌కు అభినందనల వెల్లువ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే


పుష్పగుచ్ఛం అందజేస్తున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్‌చైర్మన్, కౌన్సిలర్లు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవో నాయకులు

జగిత్యాల/జగిత్యాలఅగ్రికల్చర్: నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన షేక్ యాస్మిన్ భాషాను గురువారం పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ ఎగ్గిడి భాస్కర్‌తో పాటు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తెలంగాణ గెజిటెడ్ అధికారులు, టెస్కాబ్ రాష్ట్ర చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, కోరుట్ల మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, వెల్గటూర్ బీఆర్‌ఎస్ నాయకులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.